# 17

# మార్పు

పక్కింట్లోకి కొత్తగా ఎవరో అద్దెకి రాబోతున్నారని భార్యాభర్తాలిద్దరూ ఉద్యోగస్తులేనని తెలిసి మొహం ముడుచుకుంది విమల. ఈ మధ్యే ఖాళీ అయిన పక్కింట్లోకి కొత్తవాళ్ళు రావడం బాగానే ఉంది. పక్కన మనుషుల అలికిడి సందడి ఉంటాయి కాబట్టి. కానీ ఆ ఇల్లాలు కూడా ఉద్యోగస్తురాలే అన్న వార్తకే విమల మొహం మారిపోయింది. తను ఉద్యోగం చెయ్యదు కాబట్టి ఇరుగు పొరుగు ఇళ్ళల్లో ఉన్న ఉద్యోగం చేసే ఆడవాళ్ళంటే అసూయపడుతూ ఉంటుంది విమల. చదువుకునే రోజుల్లో డిగ్రీ పూర్తి చేసి ఏదో ఒక ఉద్యోగం చెయ్యాలన్న ఉబలాటంతో ఉండేది. కానీ ఆ కోరిక తీరకుండానే డిగ్రీ పరీక్షలు అవగానే మూడుముళ్ళూ వేయించేశారు అమ్మా నాన్నా. ఆ కోపం మనసులో ఉండిపోవడంవల్లనో ఏమో ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళని చూస్తే మూతి తిప్పుకోవడం అలవాటైపోయింది. పెళ్ళయి రాగానే ఎందులోనైనా చేరదామనుకుంటే అత్తగారికి అనారోగ్యం చేసింది. ఆవిడకి తగ్గేసరికి వెంట వెంటనే మరేవో కారణాలు రావడం ఆ తర్వాత ఎక్కువ తేడా లేకుండా ఇద్దరు పిల్లల తల్లికావటం... తెలియకుండానే ఆ పిల్లలు ఇల్లు ఇదే లోకంగా అయిదారేళ్ళు గడిచిపోయాయి. ఉద్యోగం సంగతి మరుగున పడిపోవటమే కాదు ఆసక్తి కూడా సన్నగిల్లింది.

పెళ్ళయిరాగానే ఎందులోనైనా చేరిపోయి ఉంటే బావుండేదన్న ఆలోచన మనసులో ఇప్పటికీ పీకుతూనే ఉంటుంది. కానీ అలా జరగకపోవడానికి కారణం అత్తగారే అన్న కోపం ఇంకా ఇంకా పెరుగుతూ వొస్తోందే తప్ప తగ్గలేదు ఏ మాత్రం కూడా. అందుకే పిల్లిమీదా ఎలుకమీదా పెట్టి ఆవిడని మాటలు పరోక్షంగా అంటూనే

ఉంటుంది ఆవిడ వినేలాగా. పైగా ఇంటి పనులు ఎక్కువ భాగం ఆవిడమీదే పడేసి టీ.వీ. ముందు కూచుంటుంది.

✧ ✧ ✧

పక్కింట్లో దిగిన రాజారావు భార్య సుజాతని గుర్తు పట్టింది విమల. కళాశాలలో తనతోపాటూ చదివిన తన స్నేహితురాలే సుజాత. చదువు పూర్తవుతూనే వాళ్ళు వేరే ఊరెళ్ళిపోవడంతో ఒకరిగురించి ఒకరికి తెలియదు ఈ రోజుదాకా. సుజాత మాత్రం చాలా సంతోషపడింది పాతస్నేహితురాల్ని చూసి. కానీ విమల మొహంలో స్నేహితురాల్ని చూసిన ఆనందం అంతగా కనపడలేదు. ఆమెతో సరిగ్గా మాట్లాడలేక పోయింది. ముక్తసరిగా మాట్లాడి పంపించేసింది. అత్తగారితో కూడా ఆమెని మాట్లాడ నివ్వలేదు. విమల ఇలా ప్రవర్తించడానికి అసూయ అనుమానాలే కారణాలు. ఆ రోజుల్లో సుజాతతో అంటూ ఉండేది తప్పకుండా ఉద్యోగం చేసి తీరతాను అని. ఇప్పుడామె తనని చులకనగా చూస్తుందేమో ఆ మాట నిలబెట్టుకోలేదని... ఇదే అదునుగా తీసుకుని ముందు ముందు తన దగ్గిర గొప్పలు చూపించుకుంటుందేమో ఉద్యోగస్తురాలినన్న అతిశయంతో... ఈ కారణాలే కాక మరొకటి కూడా బుర్రలోకి దూరి విమలకి ఇబ్బందికరం అనిపించింది... అదే అత్తగారి విషయం. ఆవిడతో సరిగ్గా ప్రవర్తించట్లేదు తను. కోపం మనసులో పెట్టుకుని విసుగులూ చిరాకులూ చూపిస్తూ రోజూ పరోక్షంగా ఏవో సూటి పోటి మాటలు అంటూనే ఉంటోంది. ఇదంతా తన స్నేహితురాలికి ఏదో ఓ రోజు చెప్పేస్తారేమో ఆవిడ. సుజాత ముందు తన పరువు పోదూ?

ఈ రకమైన ఆలోచన్లతో అనవసరంగా మనసుపాడు చేసుకుంటూ నలిగి పోతోంది విమల.

కొద్దిరోజుల్లోనే పరిస్థితి గ్రహించుకుంది సుజాత.

తనకి తెలియకుండానే అప్పుడప్పుడు మాటల్లో బయటపడిపోతుండేది విమల. అందువల్లే అర్థం చేసుకోగలిగింది సుజాత. స్నేహితురాలి మనసులో చింత దూరం చెయ్యాలని ఏదన్నా ఉపాయం ఆలోచించక తప్పదని నిర్ణయించుకుంది.

✧ ✧ ✧

ఓ రోజు ఆఫీసునుంచి ఇంటికి వొచ్చేటప్పటికి వీధిగుమ్మంలో పూలు కొంటూ కనపడిన విమలని పలుకరించింది సుజాత.

"రా విమలా... కాసేపు కబుర్లు చెప్పుకుందాం" తలుపు తాళం తీస్తూ పిల్చింది.

"ఇప్పుడా? మీ ఆయనవొచ్చే వేళవుతోంది కదా?"

"ఆఫీసుపనిమీద ఇవాళ పొద్దున్నే ఊరెళ్ళారు. రేపొస్తారు".

రెండేళ్ళకిందటే పెళ్ళి చేసుకుంది సుజాత. ఇంకా పిల్లల్లేరు.

ఏ కళనుందోగానీ వెంటనే సరే అంది విమల. ఇంట్లోకెళ్ళి అత్తగారికి వినపడేలా ఏ గోడకో తలుపుకో చెప్తున్నట్టుగా "నేను కాసేపు సుజాత దగ్గిర కూచుని వొస్తాను" అనేసి బయటికొచ్చింది.

"ఏం ఉద్యోగాలో ఏమిటో?... ఆదరాబాదరా పొద్దున్నే పోవడం సాయంత్రానికి నీరసంగా వేలాడిపోతూ రావడం" ఉస్సురని నిట్టూరుస్తూ సుజాత అన్న మాటలకి వింతగా చూసింది విమల.

"ఉద్యోగం చెయ్యనందుకు నేను బాధపడుతుంటే... చేస్తున్నందుకు నువ్వు బాధపడుతున్నావా?"

"అందుకేనేమో పొరుగింటి పుల్లకూర రుచి అన్నారు పెద్దలు" నవ్వింది సుజాత. మళ్ళీ వెంటనే తనే అంది "పోనీ మానేద్దామా అంటే ఒకసారి అలవాటు పడ్డాక ఉద్యోగం మానడమూ కష్టమే విమలా".

కబుర్లు చెప్తూనే టీ కలిపి తీసుకొచ్చింది ఇద్దరికీ.

"నిన్ను చూస్తుంటే చాలా ముచ్చటేస్తోంది విమలా... ఇల్లూ పిల్లల్నీ తీర్చిదిద్దుకోవటమే కాదు, మీ అత్తగార్ని ఎంతో ఆప్యాయంగా బాధ్యతగా చూసుకుంటావుట. నీలాంటి కోడలు దొరకడం నిజంగా ఆవిడ అదృష్టం".

"నీతో ఎవరు చెప్పారు?" అడగకుండా ఉండలేకపోయింది విమల అదోలా చూస్తూ.

"మీ అత్తగారే చెప్పారు" ఏ మాత్రం తడబడకుండా చాలా మామూలుగా జబాబిచ్చింది సుజాత. ఆ అత్తా కోడళ్ళిద్దరి మధ్యా అపేక్ష వెల్లివిరిసేలా చెయ్యడానికి

ఇదే మంచి పద్ధతి అనిపించి చల్లని మాటగా అలా చెప్పింది. ఇద్దరు మనుషుల మధ్య స్నేహాన్ని గానీ బాంధవ్యాన్నిగానీ పడగొట్టడం చాలా తేలిక, పటిష్ఠం చెయ్యడం ఎంతో కష్టమన్న విషయం అర్థం చేసుకున్న వ్యక్తి కాబట్టే తన ప్రయత్నం తను చెయ్యాలనుకుంది సుజాత. అందులోనూ విమల తన స్నేహితురాలు... పక్కింట్లోనే ఉంది. ఆమెలో మార్పువొచ్చి సంతోషంగా ఉంటే... దిగులుగా లేకుండా ఉంటే తనకి ఆనందమేగా. ఈ ఆలోచనతోనే చొరవతీసుకుంది.

వెంటనే ఏమీ మాట్లాడలేకపోయింది విమల. తల దించుకుంది. తన గురించి అంతమంచిగా చెప్పారా అత్తయ్యగారు? అటువంటి మనిషికి కోడలుగా అవటం తన అదృష్టం... అనవసరంగా లేనిపోని కారణాలతో కోపం పెంచుకుని ఇంట్లో పన్లు పిల్లల పన్లు అన్నీ ఎక్కువ భాగం ఆవిడ మీదే పడేసి రోజంతా టీ.వీ ముందు కూచునే తనని విమర్శించకుండా మెచ్చుకున్నారా సుజాత దగ్గర? ఇన్నాళ్ళూ ఆవిడని తప్పుగా అర్థం చేసుకుని ఎంత అహంకారంతో ప్రవర్తిస్తోంది తను? లోపం తనలో ఉంచుకుని ఎదుటివారిమీద నెపం వేయడం ఎంత హాస్యాస్పదం? చేస్తే ఇంట్లో పన్లే ఎన్ని లేవు? అవెందుకు తప్పించుకుని తిరుగుతోంది తను? ఎవర్ని సాధించాలని? దానివల్ల ప్రయోజనం ఏమిటి? ఈ కుటుంబం తనది కాదా? వీళ్ళు తనవాళ్ళు కారా? ఇంట గెలిచి రచ్చగెలవమన్నారు. ఇంత చిన్న విషయం కూడా తెలియకుండా ఇన్నాళ్ళూ ఎలా ఉంది తను?

ఈ ఆలోచన్లతో మనసులో చాలా నొచ్చుకుంది విమల. ఇంట్లోకి వెళ్తూనే అత్తగారు చేస్తున్నపని తను అందిపుచ్చుకుంది, "మీరు కూచోండి అత్తయ్యగారూ. నేను చేసేస్తాను" అంటూ. నమ్మలేనట్టు చూసింది సావిత్రమ్మ. ఆవిడ ఆశ్చర్యానికి కారణం కోడలు పని అందిపుచ్చుకోవడం ఒక్కటే కాదు... అత్తయ్యగారూ అంటూ అంత మృదువుగా నోరారా ఆమె పిలవడం కూడా ఓ కారణమైంది.

ఆ మాత్రానికే చాలా సంతోషపడిపోయిందావిడ. అత్తగారి కళ్ళల్లో మెరుపు గమనించిన విమల మనసు తేలిక పడింది.

"రేపొద్దున పిల్లలు బడికి వెళ్ళాక మనిద్దరం గుడికి వెళ్ళొద్దాం అత్తయ్యగారూ విమల మాటలకి తప్పకుండా వెళ్దాం అంటూ పొంగిపోయింది సావిత్రమ్మ. ఎప్పుడు

తను గుడికి తీసుకువెళ్ళమని అడిగినా ఏదో వంక చెప్పి తప్పించుకుంటూ ఉండే కోడలు తనంత తానుగా ఆ మాట అనడం ఆనందమేకదా ఆవిడకి.

ఒక్కత్తీ వెళ్ళే ధైర్యం లేదు. వాళ్ళతో వీళ్ళతో కలిసి ఇక్కడికి అక్కడికీ తిరిగే అలవాటు అసల్లేదు. అందుకే కోడలు ఆ మాట అనడంతో ఇంక ఇంతకంటే తనకేం కావాలి అనిపించిందావిడకి...

మర్నాడు సాయంత్రం విమలతో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ హఠాత్తుగా అంది సుజాత. "రోజూ సాయంత్రంపూట మీ పిల్లలిద్దరికీ చదువు చెప్తుకుంటావు కదూ నువ్వు?"

"ఔను..." దీర్ఘం తీసింది విమల ఎందుకలా అడుగుతోందో అర్థం కానట్టు చూస్తూ.

"వాళ్ళతోపాటే ఇంకో నలుగురు పిల్లల్ని కూచోపెట్టుకుని చదువు చెప్తానంటే హోం వర్కు చేయిస్తానంటే ఈ వీధిలోనే ఉన్న మా కొలీగ్స్ పిల్లలు కూడా వొస్తారు ఊరికే వొద్దు. నెలకింతని ఖచ్చితంగా తీసుకో. ఆఫీసునుంచి రాగానే ఇంట్లో పనులమీద పడిపోతారు. పిల్లల చదువుల సంగతి పట్టించుకోడానికి ఓపిక ఉండట్లేదు దగ్గర్లో ఎవరైనా ట్యూషన్ చెప్పేవాళ్ళుంటే బాగుండునని అంటున్నారు వాళ్ళు.

"ట్యూషన్లు చెప్పడమా?" నుదురు చిట్లించింది విమల.

"ఏం? అదేమన్నా తక్కువ పనా? ఎందుకంత తేలిగ్గా తీసిపడేస్తున్నావు? బయటికెక్కడికో వెళ్ళి చేస్తేనే ఉద్యోగమా?"

ఆలోచన్లో పడింది విమల.

స్నేహితురాలి మేలుకోరే మనిషి కాబట్టి వివరంగా విడమరిచి చెప్పింది మళ్ళీ సుజాత.

"చూడు విమలా. నీ ఓపికనిబట్టి నువ్వింకా ఎక్కువమందికి చెప్పగలననుకున్నా మెల్లి మెల్లిగా ఇంకా పిల్లల్ని చేర్చుకోవచ్చు. ఏదైనా పని చేసి డబ్బు సంపాదించాలన్న నీ కోరికా తీరుతుంది. నువ్వు నేర్చుకున్న విద్యా సార్థకమవుతుంది.

ఇదేదో బాగానే ఉన్నట్టనిపించింది విమలకి ఆలోచించి చూడగా. ఏమీ చెయ్యలేకపోతున్నానని ఇన్నాళ్ళుగా మథనపడిపోవడం తప్ప ఇలాంటి. తలంపే తనకి రానందుకు సిగ్గుపడింది. సుజాతకి కృతజ్ఞతలు చెప్పుకుంది.

రెండురోజుల్లో స్నేహితురాలిచ్చిన సలహాని ఆచరణలో పెట్టింది. మనిషిలో ఉత్సాహం మనసులో ప్రశాంతత చోటు చేసుకున్నాయి. ఆమెలో వచ్చిన మార్పుకి అత్తగారూ, భర్త మాత్రమే కాదు స్నేహితురాలు సుజాత ఆనందానికి కూడా అవధి లేదు. మార్పుకి కారణం తనే అన్న గర్వం సుజాతలో కలగలేదు. అదే ఆమె గొప్పతనం.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి ప్రసారం